సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 1 । జనవరి । 2023

I

వేంకటేశ్వరస్వామికి నవనీతసేవ



జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న ఆలయంలో వేంకటేశ్వరస్వామికి శనివారం నవనీత సేవ జరిపారు. స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవిని ఆలయ ప్రాంగణంలో ఊరేగింపుచేశారు.

ఆర్థిక సహాయం



విజయనగరం అర్బన్: ఇటీవల మృతిచెందిన తహసీల్దార్ ఓళ్ల శ్రీనివాసరావు కుటుంబానికి విజయనగరం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అండగా నిలిచింది. రూ.3.07 లక్షల సాయాన్ని జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ గోవిందుతో కలిసి కలెక్టర్ ఎ.సూర్యకుమారి తన చాంబర్‌లో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

నాలుగో తేదీలోగా ఫీజు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని ప్రైవేట్ అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి అఫిలియేషన్ ఫీజు జనవరి నాలుగో తేదీలోగా చెల్లించాలని ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి అఫిలియేషన్ అప్లికేషన్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి జనవరి 10 వరకు అవకాశం ఉందన్నారు. ఈ గడువు తేదీ ఎట్టి పరిస్థితుల్లో పొడిగించబడదని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి మనసున్న మహరాజు

- ఉపముఖ్యమంత్రి రాజన్నదొర



సీఎమ్ రిలీఫ్‌ఫంఢ్ చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మనసున్న మహరాజని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని చిన్నవీధికి చెందిన బాలుడు గొంప దినేష్ కార్తీక్ కొద్దికాలంగా అనారోగ్యంతో చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.65వేల చెక్కును రాజన్నదొర బాలుడి కుటుంబీకులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 62 మందికి సుమారు రూ.60 లక్షలు సీఎమ్ రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైనట్టు వెల్లడించారు.

హ్యాపీ న్యూ ఇయర్





కాలచక్రం గిర్రున తిరిగింది. 2022వ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. క్యాలెండర్‌లో చివరిపేజీ శనివారం చిరిగిపోయింది. కొంగొత్త ఆలోచనలు.. ఆశయాలు.. ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టే వేళ.. సంతకవిటి మండలం సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2023 సంవత్సరానికి అంకెలతో స్వాగతం పలుకగా... ప్రజలందరి జీవితం కాంతివంతం కావాలని కాంక్షిస్తూ విజయనగరం నర్తనశాల నృత్య కళాశాల విద్యార్థినులు కొవ్వొత్తుల వెలుగులో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం/రాజాం

క్యాలెండర్ ఆవిష్కరణ

సాలూరు: ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర శనివారం తన నివాస గృహంలో ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏటీడబ్ల్యూ శ్రీనివాసరావు, సంఘ నాయకులు శేషగిరిరావు, సూర్యనారాయణ, ఎం.లచ్చయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మన్యం సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యంజిల్లా సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం సమష్టిగా ముందుకు సాగుతోందని కలెక్టర్ నిషాంత్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఆవిర్భావం నుంచి అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్టు వివరించారు. ప్రజల ఆశయాలు నెరవేర్చుతున్నామన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరొందిన మన్యంమీదుగా ఒక జాతీయ రహదారి మాత్రమే వెళ్తోందన్నారు. జాతీయ రహదారి మార్గంలో ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాచిపెంట మండలంలో పారిశ్రామికవాడకు 2వేల ఎకరాలు గుర్తించామని చెప్పారు. 31 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు 2023 ఫిబ్రవరి నాటికి పూర్తవుతాయన్నారు. జిల్లా మీదుగా మూడవ రైల్వేలైన్ రావడం వల్ల విశాఖ-రాయపూర్ మార్గంలో పార్వతీపురం ప్రధాన రైల్వే స్టేషన్‌గా ఆవిష్కృతమవుతుందని చెప్పారు. గూడ్స్, పాసింజర్ రైలు రాకపోకలు పెరుగుతున్నాయని, తద్వారా పర్యాటక పరంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. శ్రీకాకుళం జిల్లా గుండా వెళ్తున్న జాతీయరహదారి నంబర్-16తో అరకు, పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లా రోడ్డును అనుసంధానం చేయడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా రూ.49.26కోట్లతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే, రూ.18కోట్లతో మదర్ చైల్డ్ హెల్త్‌కేర్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో 100 పడకలు ఉంటాయని తెలిపారు. ఆస్పత్రిలో వివిధ పనులు చేపట్టేందుకు అత్యవసరనిధి కింద రూ.2కోట్ల నిధిని ఉంచడం జరుగుతుందన్నారు. ఈప్రాంతం ఒక మెడికల్ హబ్‌గా తయారవుతుందని తెలిపారు. జిల్లాలో సాలూరు, భద్రగిరి, కురుపాం తదితర సామాజిక ఆస్పత్రులను అప్‌గ్రేడ్‌చేస్తామన్నారు. జిల్లాలోని 31 పీహెచ్‌సీలను నాడు-నేడు కింద అభివృద్ధి చేశామని చెప్పారు. ఆరు కొత్త పీహెచ్‌సీలు భవన నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వైద్యరంగంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటివరకు మూడు జాబ్‌మేళాలు నిర్వహించి దాదాపు 900 మంది యువతకు ఉపాధి కల్పించామన్నారు. పాలకొండ, కురుపాం, పార్వతీపురంలో స్కిల్ హబ్‌కేంద్రాలను ఏర్పాటుచేసి యువతకు శిక్షణనిస్తూ దాదాపు 600 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు వెల్లడించారు.

వ్యవసాయానికి అధికప్రాధాన్యత

జిల్లాలో సాగుచేసిన జీడిమామిడి, అనాస, బ్రౌన్ రైస్, చిరుధాన్యాలు, అటవీఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్‌ను కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయుష్మాన్ ఉత్కృష్ట పురస్కారం, స్వచ్ఛసర్వేక్షన్ జాతీయ పురస్కారాలు జిల్లాకు అందడం గర్వకారణమన్నారు. ఇప్పటివరకు ఆర్‌బీకేల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు వెల్లడించారు.

పర్యాటకరంగంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పర్యాటక ప్రదేశాలు అనేకం ఉన్నాయని, వాటి అభివృద్ధిపై దృష్టిసారించామని కలెక్టర్ చెప్పారు. గుమ్మలక్ష్మీపురంలో ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు ఈ నెలలో ప్రారంభిస్తామని తెలిపారు. సీతంపేట మండలంలోని ఆడాలి వ్యూపాయింట్ వద్ద ఆరు నుంచి ఏడు కాటేజీలు నిర్మిస్తామన్నారు. తోటపల్లి రిజర్వాయర్ వద్ద వద్ద సమగ్రమైన ప్రణాళికతో దేవదాయ, పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

కొత్త ఏడాదిలో ఉపాధి కల్పనే లక్ష్యం

- త్వరలో భోగాపురం ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభం
- తాగు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహం
- విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- ఖరీఫ్ సీజనల్‌లో సమృద్ధిగా పంటల సాగుతో రైతన్నల్లో ఆనందం
- అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతాం
- నూతన సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలకు మంచి జరగాలి
- జెడ్పీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



జెడ్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: నూతన సంవత్సరంలో వెనుకబడిన ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. జిల్లా ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2023 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. జిల్లాపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చల్లనిచూపు ఎల్లవేళలా ఉండాలన్నారు. కొత్త ఏడాదిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్...

జిల్లాలో 2022 సంవత్సరంలో ఖరీఫ్ పంటలు చేతికందడంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోందని మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరోనా నుంచి ప్రజలంతా కోలుకోవడం శుభపరిణామంగా పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తజనుల సమక్షంలో ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లమ్మవారి ఉత్సవాలు, విజయనగరం ఉత్సవాలు వైభంగా నిర్వహించుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు కొత్తగా చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులకు ఇదే సంవత్సరంలో శ్రీకారం చుట్టడం శుభపరిణామని, 2023 తరగతుల నిర్వహణదిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జిల్లా కేంద్రాస్పత్రి సర్వజన ఆస్పత్రిగా రూపాంతరం చెందిందని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించడంలో విజయవంతమయ్యామని చెప్పారు.

అర్హులందరికీ పింఛన్లు..

జిల్లాలో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు జెడ్పీ ఛైర్మన్ వెల్లడించారు. జిల్లాలో క్రొతగా 9,800 పింఛన్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో సుమారు 2.87లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే సోషల్‌ఆడిట్‌లో భాగంగా ఆర్థిక ప్రగతి సాధించిన 4,800 మంది కుటుంబాల్లోని పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశామన్నారు. వీరిలో 2,500 సరైన వివరణలు అందించడంతో అధికారులు అర్హులుగా గుర్తించారన్నారు. మిగిలిన వారు తమ అర్హతల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు 7వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు.